సాక్షి
అనంతపురం
మంగళవారం । 24 । జూన్ । 2025



చీనీ టన్ను రూ.27 వేలు

అనంతపురం మార్కెట్‌యార్డులో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.27 వేలు పలికాయి.



హెచ్చెల్సీ పనుల పరిశీలన

తుంగభద్ర ప్రధాన ఎగువ కాలువ పరిధిలో రూ.35.06 కోట్లతో చేపట్టిన ఆధునికీకరణ పనులను క్వాలిటీ కంట్రోల్ అధికారులు సోమవారం తనిఖీ చేశారు. 8లో

గరిష్టం/కనిష్టం
33.4°/23.6°

జిల్లా అంతటా సోమవారం ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గాయి. గాలివేగం పెరిగింది. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. నైరుతి దిశగా గంటకు 8 నుంచి 16 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

నీళ్లు రాకపోతే ఎలా బతకాలి?

- కళ్యాణదుర్గంలో రోడ్డెక్కిన మహిళలు



కళ్యాణదుర్గం టీసర్కిల్‌లో రోడ్డుపై బైఠాయించిన మహిళలు, స్థానికులు

కళ్యాణదుర్గం రూరల్: 'నాలుగు నెలలుగా తాగు నీటి సమస్య తీవ్రంగా ఉంది. మున్సిపల్ అధికారులు, కూటమి నేతలకు అనేక సార్లు తెలిపినా ఎవరూ పట్టించుకోలేదు. నీళ్లు రాకపోతే ఎలా బతకాలి' అంటూ కళ్యాణదుర్గంవాసులు ఆవేదన వ్యక్తం చేశారు. కళ్యాణదుర్గం మున్సిపాలిటీలో 6, 11 వార్డుల పరిధిలోని రాచప్ప కుంట వీధి, వడ్డే బండ వీధి కాలనీవాసులు రోడ్డెక్కారు. సోమవారం ఖాళీ బిందెలతో టీ సర్కిల్లో నిరసన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఆయా కాలనీల మహిళలు మాట్లాడుతూ నాలుగు నెలలుగా నీటి సమస్య వేధిస్తోందన్నారు. ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబుకు ఇప్పటికే అనేక సార్లు తెలియజేసినా పట్టించుకోలేదన్నారు. పరిష్కరిస్తామని హామీ ఇచ్చి మరచిపోతున్నారన్నారు. ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేస్తామంటూ కుటుంబానికి రూ. 50 చొప్పున మున్సిపల్ అధికారులు వసూలు చేస్తున్నారన్నారు. ఆ ట్యాంకర్లు కూడా టీడీపీ నేతల ఇంటి ముందు మాత్రమే ఆగుతాయని, మరోచోటికి రమ్మంటే నీళ్లు అయిపోయాయని చెబుతున్నారన్నారు. మున్సిపల్ కమిషనర్ వంశీ అక్కడికి చేరుకుని మహిళలతో మాట్లాడారు. నాలుగు రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో మహిళలు నిరసన విరమించారు. కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

మిరప రైతుకు కుచ్చుటోపీ

బెళుగుప్ప: మండలంలోని శీర్పి గ్రామానికి చెందిన రైతు ఏకాంబరేశ్వర బ్యాంక్ ఖాతా నుంచి రూ.2 లక్షలను సైబర్ నేరగాళ్లు అపహరించారు. పోలీసులు తెలిపిన మేరకు... రైతు ఏకాంబరేశ్వర తనకున్న ఏడెకరాల పొలంలో మిరప పంట సాగుతో కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో ఇటీవల సాగు చేసిన పంట చేతికి రావడంతో మార్కెట్‌లో విక్రయించాడు. దీంతో కళ్యాణదుర్గంలోని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌లోని రైతు ఖాతా (5010 059 3095 411)కు రూ.2 లక్షలను వ్యాపారి జమ చేశాడు. ఈ క్రమంలో మరో పంట పెట్టేందుకు సిద్ధమైన రైతు రెండు రోజుల క్రితం పెట్టుబడుల కోసమని డబ్బు డ్రా చేసేందుకు బ్యాంక్‌కు వెళ్లాడు. అయితే బ్యాంక్ ఖాతాలో నగదు నిల్వ లేకపోవడంతో అధికారులను కలసి ఆరా తీశాడు. తన ఖాతా నుంచి ఈ నెల 11న రూ.లక్ష ఇండియన్ బ్యాంకుకు, మరో రూ.లక్ష మహీంద్రా బ్యాంకుకు బదిలీ అయినట్లు బ్యాంక్ అధికారులు తెలపడంతో తన ప్రమేయం లేకుండా నగదు ఎలా బదిలీ అవుతుందని ప్రశ్నించాడు. బ్యాంక్ అధికారులు పొంతనలేని సమాధానాలు ఇవ్వడంతో మోసపోయినట్లుగా నిర్ధారించుకుని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శివ తెలిపారు.

నాయకత్వ అభివృద్ధి శిక్షణకు సర్పంచు మోనాలిసా



వజ్రకరూరు: వజ్రకరూరు మేజర్ పంచాయతీ సర్పంచు మోనాలిసా నాయకత్వ అభివృద్ధి శిక్షణకు ఎంపికయ్యారు. ఈ నెల 28 నుంచి జులై 4 వరకు ఢిల్లీలో నిర్వహించనున్న శిక్షణ కార్యక్రమంలో ఆమె పాల్గొననున్నారు. ఇటీవల ఇండియన్ స్కూల్ ఆఫ్ డెమోక్రసీ అనే సంస్థ దేశ వ్యాప్తంగా సర్వే నిర్వహించింది. ప్రజలకు మెరుగైన సేవలు అందించడంతో పాటు నాయకత్వ లక్షణాలు కలిగిన మహిళా ప్రజాప్రతినిధులు 45 మందిని శిక్షణకు ఎంపిక చేసింది. ఇందులో వజ్రకరూరు మేజర్ పంచాయతీ సర్పంచు మోనాలిసా ఉండటం గమనార్హం. ఈ సందర్భంగా సర్పంచు మోనాలిసా మాట్లాడుతూ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ప్రజలకు మరింత సమర్థవంతంగా సేవలందిస్తానని పేర్కొన్నారు.

అవార్డు అందుకున్న కలెక్టర్, ఎస్పీ



అనంతపురం అర్బన్: 'యోగాంధ్ర'లో భాగంగా ఈనెల 14న అనంతపురంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి దివ్యాంగుల యోగా కార్యక్రమానికి అవార్డు లభించింది. సోమవారం విజయవాడలో జరిగిన 'తొలి అడుగు' కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చేతుల మీదుగా కలెక్టర్ వి.వినోద్‌కుమార్, ఎస్పీ పి.జగదీష్ అవార్డును అందుకున్నారు.

వంచనపై యువజనాగ్రహం

- చంద్రబాబు దగాపై కదం తొక్కిన యువత
- నమ్మించి నట్టేట ముంచారని ఆగ్రహం
- తగిన బుద్ధి చెబుతామని హెచ్చరిక
- 'వైఎస్సార్ సీపీ యువత పోరు' విజయవంతం

అనంతపురం కార్పొరేషన్: కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యంపై యువత కదం తొక్కింది. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేష్‌కు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేసింది. వైఎస్సార్ సీపీ తోడుగా నిరసనాగ్రహం తెలిపింది. వైఎస్సార్ సీపీ యువజన, విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో సోమవారం అనంతపురం కలెక్టరేట్ వద్ద నిర్వహించిన 'యువత పోరు' కార్యక్రమం విజయవంతమైంది. కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు సాకే చంద్రశేఖర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ఉద్యమాలతోనే సీఎం చంద్రబాబు దిగొచ్చారన్నారు. 'తల్లికి వందనం' అమలు చేశారన్నారు. ప్రతి పథకం అమలు చేసే వరకు పోరాడతామన్నారు. హామీలు అమలు చేయకపోతే కాలర్ పట్టుకోండని ఎన్నికలకు ముందు కూటమి నేతలు ప్రగల్భాలు పలికారని, ఇప్పుడు ఎవరి కాలర్ పట్టుకోవాలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేష్ చెప్పాలన్నారు. 'యువత పోరు' నుంచి ప్రజల దృష్టి మరల్చేందుకు ప్రభుత్వం నీచ రాజకీయాలకు తెరలేపిందని దుయ్యబట్టారు. రెడ్ బుక్ పేరుతో దౌర్జన్యాలు, అక్రమ అరెస్టులు చేస్తున్నారని విమర్శించారు. తమ పార్టీ అధినేత వైఎస్ జగన్ నేతృత్వంలో ప్రభుత్వ మెడలు వంచుతామని, హామీలు అమలు చేయకపోతే పాలన స్తంభింప జేస్తామని ఆయన హెచ్చరించారు.

కేసులకు భయపడం..

పార్టీ పార్లమెంట్ పరిశీలకులు నరేష్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ పథకాలు అమలు చేయకుండా చంద్రబాబు ఏడాది కాలం వెల్లదీశాడన్నారు. ఆర్థిక పరిస్థితి బాగోలేదని, రాష్ట్రం దివాళా దీసిందని తప్పుడు మాటలు మాట్లాడుతున్నారని దుయ్యబట్టారు. ప్రస్తుతం కాగ్ నివేదికను పరిశీలిస్తే.. అభివృద్ధి 3 శాతం మాత్రమే ఉందని తేలిందన్నారు. గతంలో కోవిడ్ విపత్కర పరిస్థితుల్లోనూ అప్పటి సీఎం వైఎస్ జగన్ నాయకత్వంలో 10 శాతం అభివృద్ధి చూపించిందని గుర్తు చేశారు. అధికార దాహంతో గద్దెనెక్కిన చంద్రబాబుకు బుద్ధి చెప్పే రోజులు దగ్గర్లోనే ఉన్నాయన్నారు. కేసులు పెట్టినా భయపడకుండా గళం విప్పుతామన్నారు. అనంతరం తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి, అనంతపురం మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు వాసంతి సాహిత్య, కోగటం విజయభాస్కర్ రెడ్డి, పార్టీ జిల్లా టాస్క్‌ఫోర్స్ సభ్యులు రమేష్‌గౌడ్, యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉమ్మడి మదన్‌మోహన్ రెడ్డి, అధికార ప్రతినిధి మారుతీనాయుడు, వైఎస్సార్ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు చంద్ర శేఖర్ యాదవ్ తదితరులు మాట్లాడారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో డీఆర్ఓ మలోలకు యువజన విభాగం నాయకులు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కొండ్రెడ్డి ప్రకాష్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఆలమూరు శ్రీనివాస్ రెడ్డి, పార్టీ నేతలు అనంత చంద్రారెడ్డి, వెన్నం శివరామిరెడ్డి, పార్టీ నగరాధ్యక్షుడు చింతా సోమశేఖర్ రెడ్డి, వక్ఫ్‌బోర్డు మాజీ చైర్మన్ కాగజ్ ఘర్ రిజ్వాన్, అనుబంధ విభాగాల అధ్యక్షులు ఓబిరెడ్డి, సైఫుల్లాబేగ్, మల్లెమీద నరసింహులు, అమర్‌నాథ్ రెడ్డి, శ్రీనివాస్ నాయక్, యువజన విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు దాదాఖలందర్, జిల్లా ప్రధాన కార్యదర్శులు లోకనాథ్ రెడ్డి, సురేష్, నగరాధ్యక్షుడు శ్రీనివాస్ దత్తా, యువజన విభాగం వివిధ నియోజకవర్గాల అధ్యక్షులు అబ్దుల్ సయ్యద్, రవీంద్ర రెడ్డి, తలారి చరణ్, నాయకులు కుళ్లాయప్ప, సోహైల్, మైను, బ్రహ్మానందరెడ్డి, చంద్రశేఖర్, విద్యార్థి విభాగం నగరాధ్యక్షుడు కైలాష్, కార్పొరేటర్లు కమల్‌భూషణ్, సంపంగి రామాంజినేయులు,చంద్రలేఖ, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత, చిత్రంలో పార్టీ పార్లమెంటు పరిశీలకుడు నరేష్ కుమార్ రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, పార్టీ నేతలు





యువత పోరు కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పాల్గొన్న యువత, వైఎస్సార్ సీపీ శ్రేణులు (ఇన్‌సెట్‌లో) ప్లకార్డులు ప్రదర్శిస్తున్న యువత



డీఆర్‌ఓకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

హామీలు అమలు చేయండి



కూటమి ప్రభుత్వంలో మేలు చేయడం పక్కన పెడితే దౌర్జన్యం, బెదిరింపులతో ప్రజలను ఇబ్బంది పెడుతున్నారు. యువతకు ఇచ్చిన హామీలను అమలు చేయండయ్యా లోకేష్ అంటే.. రెడ్ బుక్ పేరుతో శిక్షిస్తామంటున్నారు. గతంలో విశాఖ ఏజెన్సీ ప్రాంతాల్లోనే గంజాయి గురించి వినేవాళ్లం. కూటమి ప్రభుత్వంలో జిల్లాలోనూ గంజాయి తాగి దోపిడీలు, దౌర్జన్యాలు చేసే పరిస్థితి. గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్ కర్నూలు నుంచి వచ్చి ఇక్కడ ఆటలు సాగిస్తామంటే కుదరదు.

– పెద్దారెడ్డి, మాజీ ఎమ్మెల్యే

జాబ్ క్యాలెండర్ ఏదీ?



ఎన్నికలకు ముందు యువతకు ఏటా జాబ్ క్యాలెండర్, నిరుద్యోగ భృతి, మెగా డీఎస్సీతో ఉపాధి కల్పిస్తామని చంద్రబాబు చెప్పారు. అధికారంలోకి వచ్చాక జాబ్ క్యాలెండర్ విషయమే మరచిపోయారు. ప్రతి నియోజకవర్గంలో యువతను ఎంపిక చేసి రూ.10 లక్షలు ఇచ్చి ఆర్థిక ప్రగతి సాధించేందుకు కృషి చేస్తామని గతంలో ఆర్భాటంగా ప్రకటించిన పవన్ కల్యాణ్ నేడు నోరు మెదపడం లేదు.

– బోయ గిరిజమ్మ, జెడ్పీచైర్‌పర్సన్

రాష్ట్రంలో రాక్షస పాలన



రాష్ట్రంలో రాక్షస పాలన సాగుతోంది. సంక్షేమం, అభివృద్ధిని పక్కన పెట్టారు. ప్రతిపక్ష వైఎస్సార్ సీపీ శ్రేణులను లక్ష్యంగా చేసుకున్నారు. వ్యవస్థలను మేనేజ్ చేసుకుని దాడులు చేస్తున్నారు. ఇష్టారాజ్యంగా వేధింపులకు పాల్పడుతున్నారు. నిరుద్యోగులకు ఉపాధి కల్పించకపోతే వారు ఎటు వెళ్లాలి? ఆర్థిక ఇబ్బందులతో యువత వ్యసనాలకు బానిసయ్యేలా ప్రభుత్వం చేస్తోంది. ఇది మంచి సంప్రదాయం కాదు.

–వసీం, అనంతపురం మేయర్

మోసానికి బ్రాండ్ అంబాసిడర్



సీఎం చంద్రబాబు మోసానికి బ్రాండ్ అంబాసిడర్. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో సంక్షేమ పథకాలతో కోట్లాది కుటుంబాల్లో జగనన్న వెలుగులు నింపారు. చంద్రబాబు పాలనలో నేడు ఆ దీపాలను ఆర్పే పని పెట్టుకున్నారు. మహిళా సాధికారత పక్కన ఉంచితే.. మహిళలపై అకృత్యాలు తారస్థాయికి చేరాయి. ప్రజలన్నీ గమనిస్తున్నారు. తప్పక బుద్ధి చెబుతారు.

– వాసంతి సాహిత్య, డిప్యూటీ మేయర్, అనంతపురం

ఉద్యమాలు కొనసాగిస్తాం



చంద్రబాబు ఒక్క హామీ నెరవేర్చకుండా ప్రజలను ఆర్థిక ఇబ్బందులకు గురి చేస్తున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పెద్ద ఎత్తున సంక్షేమం, అభివృద్ధి జరిగింది. కూటమి ప్రభుత్వం ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చకపోతే ఊరుకునేది లేదు. సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్‌లను నిలదీస్తాం. ప్రజలకు మేలు జరిగే వరకు వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ఉద్యమాలు కొనసాగిస్తాం.

– కోగటం విజయభాస్కర్ రెడ్డి, డిప్యూటీ మేయర్

ఉన్న ఉద్యోగాలు తొలగించారు



సీఎం చంద్రబాబు తన కుమారుడు లోకేష్‌కు, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌కు మాత్రమే ఉద్యోగాలు కల్పించారు. పేద యువత సంక్షేమం గురించి మరచిపోయారు. వలంటీర్లతో పాటు అబ్కారీ తదితర శాఖల్లో ఉన్న ఉద్యోగాలను ఊడగొట్టారు. హామీలను నెరవేర్చే వరకు పోరాటం ఆగదు.

– ఉమ్మడి మదన్‌మోహన్ రెడ్డి, యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

యువత జీవితాలతో చెలగాటం



జగనన్న తన నాయకత్వంలో గ్రామ స్వరాజ్యం తీసుకొచ్చారు. వలంటీర్లు, వైద్య రంగం, ఎక్సైజ్‌లో 3 లక్షల మందికి ఉపాధి కల్పించారు. కానీ, చంద్రబాబు సీఎంగా బాధ్యతలు చేపట్టాక ఉపాధి లేకుండా చేశారు. యువత జీవితాలతో చెలగాటం ఆడుతున్న బాబు ముఖ్యమంత్రిగా మనకు అవసరమా అనేది ప్రజలే తేల్చుకోవాలి.

– రమేష్‌గౌడ్, పార్టీ జిల్లా టాస్క్‌ఫోర్స్ సభ్యులు

పోరాటం ఆగదు



యువతకు అండగా నిలుస్తామని, లేని పక్షంలో తన కాలర్ పట్టుకోవాలని లోకేష్ అన్నారు. కానీ నేడు యువత రోడ్లపైకి వచ్చేలా చేశారు. హామీలు నెరవేర్చకపోతే కాలర్ కాదు లోకేష్ జుట్టు పట్టుకుని అయినా యువతకు వైఎస్సార్ సీపీ మేలు చేస్తుంది. కేసులు పెట్టినా.. జైలుకు పంపినా ప్రజల పక్షాన వైఎస్సార్ సీపీ పోరాడుతుంది.

– సాకే చంద్రశేఖర్, పార్టీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు

సర్కారుకు కనువిప్పు కల్గిస్తాం



సీఎం చంద్రబాబు యువతను రోడ్డుపైకి ఈడ్చారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో యువతకు ఉపాధి కల్పించడంతో పాటు కార్పొరేట్ విద్యను ఉచితంగా అందించి పేద కుటుంబాలకు జగనన్న అండగా నిలిచారు. నిరుద్యోగుల జీవితాలతో ఆటలాడుతున్న కూటమి ప్రభుత్వానికి కనువిప్పు కల్గిస్తాం.

– మారుతీ నాయుడు, యువజన విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి

అన్ని వర్గాలకూ అన్యాయమే..



విద్యార్థులు, యువత, మహిళలు ఇలా అన్ని వర్గాలకూ కూటమి ప్రభుత్వం అన్యాయం చేసింది. తల్లికి వందనంలో అర్హులకు న్యాయం జరగలేదు. ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వకుండా విద్యార్థులకు ఉన్నత చదువును దూరం చేశారు. విద్యార్థులపై దాడులతో పాటు వారు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి ఏపీలో నెలకొంది.

– చంద్రశేఖర్ యాదవ్, వైఎస్సార్ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు

కనికరం లేని కూటమి సర్కారు



ఆదివారం కౌన్సెలింగ్ కేంద్రం వద్ద ఎంటీఎస్ టీచర్ల ఆందోళన (ఫైల్)

- ఎంటీఎస్ టీచర్లపై దయ చూపని చంద్రబాబు ప్రభుత్వం
- బదిలీ ఖాళీలపై వెనక్కు తగ్గని వైనం

అనంతపురం ఎడ్యుకేషన్: ఎంటీఎస్ టీచర్ల బదిలీలకు సంబంధించిన ఖాళీలపై ప్రభుత్వం వెనక్కు తగ్గలేదు. తక్కువ వేతనంతో పని చేస్తున్న వారిపట్ల కాసింత కనికరం కూడా చూపలేదు. ఈ క్రమంలో తొలిరోజు చూపించిన ఖాళీలకంటే ఒక్కటంటే ఒక్కటికూడా అదనంగా చూపించలేమంటూ అధికారులు తేల్చి చెప్పారు. మంగళవారం కౌన్సెలింగ్ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. 2008, 1998 డీఎస్సీ క్వాలిఫై అయి ప్రస్తుతం ఎంటీఎస్ కింద పని చేస్తున్న టీచర్లందరూ తప్పకుండా హాజరుకావాలని సూచించారు. ఇదిలాఉండగా...ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 594 మంది ఎంటీఎస్ టీచర్లు పని చేస్తున్నారు. ఇటీవల జరిగిన ఉపాధ్యాయుల బదిలీల్లో ప్రస్తుతం ఎంటీఎస్ టీచర్లు పని చేస్తున్న స్థానాలన్నీ ఖాళీలుగా చూపించారు. అవి భర్తీ కావడంతో ప్రస్తుతం కౌన్సెలింగ్ ద్వారా సీనియార్టీ మేరకు జిల్లాలో ఉన్న ఖాళీలను అనుసరించి ఎంటీఎస్ టీచర్లను సర్దుబాటు చేసేందుకు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో జిల్లా వ్యాప్తంగా 693 ఖాళీలు చూపించి ఆదివారం కౌన్సెలింగ్ ప్రక్రియ ఏర్పాటు చేశారు. అయితే, పోస్టుల్లో 80 శాతం దాకా జిల్లా సరిహద్దు మండలాల్లోనే ఉండటంతో ఎంటీఎస్ టీచర్లు ఆందోళనకు దిగారు. అనంతపురం కార్పొరేషన్‌తో పాటు అన్ని మునిసిపాలిటీ కేంద్రాలు, సింగిల్ టీచరు పని చేస్తున్న స్కూళ్లకు తమను కేటాయించాలని డిమాండ్ చేస్తూ ఉదయం నుంచి సాయంత్రం దాకా ఆందోళన చేపట్టారు. డీఈఓ ఎం.ప్రసాద్‌బాబు పలుమార్లు ఆర్జేడీ, రాష్ట్ర అధికారులతో ఫోన్‌లో చర్చించినా ఎలాంటి ఉపయోగం లేకపోవడంతో రాత్రి 7 గంటల సమయంలో ప్రక్రియను బాయ్‌కాట్ చేస్తున్నట్లు ప్రకటించి కౌన్సెలింగ్ కేంద్రం నుంచి అందరూ వెళ్లిపోయారు.

నేడు కౌన్సెలింగ్

ఎంటీఎస్ టీచర్ల బదిలీలకు మంగళవారం ఉదయం 9 గంటలకు సైన్స్ సెంటర్‌లో కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు డీఈఓ ఎం.ప్రసాద్‌బాబు తెలిపారు. ఖాళీలను చూపించే విషయంలో ఎంటీఎస్ టీచర్ల డిమాండ్లను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామన్నారు. ప్రస్తుతం ప్రకటించిన ఖాళీలకు మించి ఏ ఒక్కటీ అదనంగా చూపించే వీలులేదని తేల్చి చెప్పినట్లు గుర్తు చేశారు. కౌన్సెలింగ్‌కు అందరూ విధిగా హాజరుకావాలని కోరారు.

వ్యాధులతో టమారా..

- రోగాల బారిన టమాట పంట
- అధిక భాగం కాయలకు మచ్చలు
- పెరికి రోడ్డుపక్కన పడేస్తున్న రైతులు
- ప్రభుత్వ సాయమూ కరువవడంతో అన్నదాతలు నష్టాలపాలు





ఆత్మకూరు సమీపంలో సాగు చేసిన టమాట పంట, (ఇన్‌సెట్‌లో) పుచ్చులు, మచ్చలు వచ్చిన టమాటలను రోడ్డు పక్కన పడేసిన దృశ్యం

ఆత్మకూరు: టమాట రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ప్రభుత్వం నుంచి ఎలాంటి సాయం అందకపోవడం, ఎప్పటికప్పుడు సూచనలు, సలహాలతో బాసటగా నిలవాల్సిన అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తుండటం వెరసి నష్టాలే మిగులుతున్నాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది రైతులు టమాట పంట సాగు చేశారు. అధికారిక లెక్కల ప్రకారం ఉమ్మడి అనంతపురం జిల్లాలో దాదాపు 30 వేల ఎకరాల వరకు పంట సాగైంది. జిల్లాలోని కళ్యాణదుర్గం, ఆత్మకూరు, శెట్టూరు, కంబదూరు, రాయదుర్గం మండలాల్లో అధికంగా టమాట సాగులోకి వచ్చింది.

వ్యాధులతో అతలాకుతలం..

టమాట పంటను రైతులు ప్రత్యేక శ్రద్ధతో కాపాడుకుంటారు. ఒక ఎకరా భూమిలో పంట సాగుకు రూ.50 వేలకు పైగా ఖర్చు వస్తోంది. నార, భూమి చదును, ఎరువులు, మందులు తదితరాలకు రైతులు ఈ మొత్తాన్ని వెచ్చిస్తున్నారు. నార పెట్టిన 70 రోజుల్లో పంట కోతకు వస్తుంది. రెండు నెలల క్రితం సాగు చేసిన పంటను ప్రస్తుతం కోయాల్సి ఉంది. అయితే, పంటలపై వ్యాధుల పంజా విసరడంతో ఆశించిన దిగుబడి కానరావడం లేదు. చెట్లకు పురుగు పట్టి కాయలపై మచ్చలు వస్తుండటంతో చాలా వరకూ కాయలు వృథాగా పోతున్నాయి. ఈ క్రమంలో రైతులు దిక్కుతోచని స్థితిలో పడిపోయారు. సాధారణంగా టమాట సీజన్ మొదట్లో అధిక ధరలు లభించేవి. కానీ, ఈ ఏడాది ఆ పరిస్థితి కనిపించడం లేదు.

సాయం కరువు..

రైతులకు ప్రభుత్వం నుంచి కూడా పైసా సాయం అందకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది దాటినా ఇంత వరకు 'అన్నదాత సుఖీభవ' కింద పంట పెట్టుబడికి కనీస సాయం చేయలేదు. దీంతో బయట అప్పులు చేసి పంటలను సాగు చేసుకుంటున్నారు. ఎంతో శ్రమకోర్చి సాగు చేసిన పంట చివరికి నష్టాలే మిగులుస్తుండటంతో అన్నదాతల ఆవేదన అంతా ఇంతా కాదు. దీనికితోడు అధికారుల నుంచి కూడా భరోసా కరువవడంతో బాధలు వర్ణనాతీతంగా మారాయి. ఎప్పటికప్పుడు పంట పొలాల్లో పర్యటించి సలహాలు సూచనలు ఇవ్వడం లేదని రైతులు వాపోతున్నారు.

పెట్టుబడి కూడా వస్తుందో లేదో?



నాలుగు ఎకరాల్లో టమాట పంటను సాగు చేశా. ఇప్పటికే రూ.2 లక్షల వరకు పెట్టుబడి పెట్టా. పంట దిగుబడి అనుకున్న స్థాయిలో లేదు. టమాట కాయలకు కూడా పూర్తిగా మచ్చలు వచ్చాయి. కనీసం పెట్టుబడి కూడా వస్తుందో లేదో అని ఆందోళనగా ఉంది.

– కందుల పుల్లారెడ్డి, రైతు, ఆత్మకూరు

ప్రభుత్వం ఆదుకోవాలి



రెండు ఎకరాల్లో టమాట పంటను సాగు చేశా. రూ. లక్ష ఖర్చు వచ్చింది. ఈ ఏడాది టమాట ధరలు అనుకున్న స్థాయిలో లేవు. ప్రభుత్వం కనీస మద్దతు ధరతో టమాటను కొనుగోలు చేయాలి. అధికారులు రైతులకు సలహాలు సూచనలిస్తే బాగుంటుంది.

– బసవరాజు, దొడగట్ట గ్రామం, కళ్యాణదుర్గం మండలం

ధర్నాలతో అట్టుడికిన కలెక్టరేట్

- సంక్షేమ పథకాల అమలు కోసం అంగన్‌వాడీల బైఠాయింపు
- జీఓ 36 అమలు చేయాలంటూ ఇంజినీరింగ్ కార్మికుల ధర్నా
- సమస్యలు పరిష్కరించాలని పారిశుధ్య కార్మికుల ఆందోళన
- డిమాండ్ల సాధనకు మునిసిపల్ ఇంజినీరింగ్ కార్మికుల నిరసన
- రైతుల సమస్యలు పరిష్కరించాలని ఏఐకేఎంఎస్ ధర్నా



కలెక్టరేట్ వద్ద అంగన్‌వాడీల ధర్నాలో మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు



కలెక్టరేట్ గేటు ఎదుట బైఠాయించిన నగర పాలక సంస్థ పారిశుధ్య కార్మికులు

అనంతపురం అర్బన్: కూటమి ప్రభుత్వ పాలనపై నిరసనలు వెల్లువెత్తాయి. ఆందోళనలతో కలెక్టరేట్ అట్టుడికింది. హామీల అమలుకు... సమస్యల పరిష్కారానికి... డిమాండ్ల సాధనకు అంగన్‌వాడీలు, మునిసిపల్ పారిశుధ్య కార్మికులు, ఇంజినీరింగ్ కార్మికులు, రైతు కూలీ సంఘం నాయకులు వేర్వేరుగా సోమవారం ధర్నాలు నిర్వహించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సమస్యలను పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున్న ఉద్యమిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. అనంతరం డీఆర్‌ఓ ఎ.మలోలకు ఆయా సంఘాల నాయకులు డిమాండ్లతో కూడిన వినతిపత్రాలు అందజేశారు.

సంక్షేమ పథకాలు అమలు చేయాలి..

సంక్షేమ పథకాలు అమలు చేయాలంటూ అంగన్‌వాడీ వర్కర్ల సంఘం ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట పెద్దసంఖ్యలో అంగన్‌వాడీ కార్యకర్తలు, మినీ వర్కర్లు ధర్నా నిర్వహించారు. అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్ల సంఘం అధ్యక్షురాలు శకుంతల అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు, సంఘం గౌరవాధ్యక్షుడు నాగేంద్రకుమార్, ప్రధాన కార్యదర్శి రమాదేవి మాట్లాడారు. అంగన్‌వాడీ వర్కర్లకు రూ.11,500, హెల్పర్లు, మినీ వర్కర్లకు రూ.7 వేలు వేతనం మాత్రమే వస్తోందని, అతితక్కువ వేతనంతో పనిచేస్తున్న అంగన్‌వాడీలకు తల్లికి వందనం, ఇతర సంక్షేమ పథకాలు వర్తింపజేయకపోవడం దుర్మార్గమన్నారు. ప్రభుత్వ ఉద్యోగులుగా నమోదు కావడంతో కనీసం రేషన్ కార్డు కూడా ఇవ్వలేదన్నారు. ప్రతి అంగన్‌వాడీకి సంక్షేమ పథకాలు అందించాలని డిమాండ్ చేశారు.

సమస్యలు పరిష్కరించాలి

దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాంటూ మునిసిపల్ కార్మిక, ఉద్యోగ సంఘం ఆధ్వర్యంలో నగర పాలక సంస్థ పారిశుధ్య కార్మికులు సోమవారం కలెక్టరేట్ గేటు ఎదుట బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్, నాయకులు వెంకటనారాయణ, ముత్తూజ, గోపాల్, ఏటీఎం నాగరాజు, తదితరులు మాట్లాడారు. పారిశుద్ధ్య కార్మికుల సంక్షేమాన్ని ప్రభుత్వం విస్మరించిందన్నారు. కార్మికులను క్రమబద్ధీకరించాలన్నారు. మరణించిన కార్మికుల కుటుంబాల్లో ఒకరికి కారుణ్య నియామకం కింద ఉద్యోగం ఇవ్వాలన్నారు. పెరిగిన నగర విస్తీర్ణానికి అనుగుణంగా కార్మికుల సంఖ్య పెంచాలన్నారు. శాశ్వత ఉద్యోగులకు ఇచ్చిన జీఓ 1615 ప్రకారం బేసిక్ వేతనంతో పాటు హెచ్‌ఆర్‌ఏ, డీఏ ఇవ్వాలన్నారు. కార్మికులకు సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు.

జీఓ 36 మేరకు వేతనాలివ్వాలి



ధర్నా చేస్తున్న మునిసిపల్ ఇంజినీరింగ్ విభాగం కార్మికులు

మునిసిపాలిటీల్లో పనిచేస్తున్న ఇంజినీరింగ్ అవుట్ సోర్సింగ్ కార్మికులకు జీఓ 36 మేరకు వేతనం ఇవ్వాలంటూ మునిసిపల్ ఉద్యోగ కార్మిక సంఘం ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో కార్మికులు సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా కమిటీ నాయకులు మల్లికార్జున, వీఎస్ రాయుడు, మురళీమోహన్, ఓబుళపతి, పోతులయ్య, తదితరులు మాట్లాడారు. 36 జీఓ ప్రకారం కార్మికులకు కేటగిరీ వారీగా రూ.21 వేలు, రూ.24,500 అమలు చేయాలన్నారు. కార్మికులను క్రమబద్ధీకరించాలన్నారు. కార్మికులకు తల్లికి వందనం, ఇతర సంక్షేమ పథకాలు ఇవ్వాలన్నారు. పెండింగ్‌లో ఉన్న పీఎఫ్ బకాయి తక్షణం చెల్లించాలన్నారు. సమస్యలు పరిష్కరించకపోతే జూలై 2వ తేదీ నుంచి నిరవధిక సమ్మె చేస్తామని హెచ్చరించారు.

న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలి



కనీస వేతనం అమలు చేయాలంటూ ధర్నా చేస్తున్న నగర పాలక ఇంజినీరింగ్ కార్మికులు

జీతం పెంపుదల, తదితర న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలంటూ ఏపీ మునిసిపల్ ఇంజినీరింగ్ కార్మిక సంఘం, ఐఎఫ్‌టీయూ సంయుక్త ఆధ్వర్యంలో ఇంజినీరింగ్ అవుట్‌సోర్సింగ్ కార్మికులు సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి లోకేష్ నాయుడు, ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి సురేష్, ఎస్‌ సంఘం నాయకుడు సాకే హరి మాట్లాడారు. టెక్నికల్ కార్మికులకు రూ.29,200, నాన్ టెక్నికల్ కార్మికులకు రూ.24,500 వేతనం ఇవ్వాలన్నారు. అవుట్ సోర్సింగ్ కార్మికులకు 62 ఏళ్లకు ఉద్యోగ విరమణకు అవకాశం కల్పించాలన్నారు. సీనియార్టీ ప్రాతిపదికన సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. విధి నిర్వహణలో మరణించి కార్మికునికి రూ.10 లక్షలు, అంగవైకల్యం పొందిన వారికి రూ.5లక్షలు పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

రైతు, రైతు కూలీల ధర్నా



రైతు, రైతు కూలీల సమస్యలు పరిష్కరించాలని ఏఐకేఎంఎస్ ధర్నా

రైతులు, రైతు కూలీల సమస్యలు పరిష్కరించాలంటూ అఖిల భారత రైతుల కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా కార్యదర్శి నాగరాజు, సహాయ కార్యదర్శి కిష్ట, కోశాధికారి రాయుడు, సభ్యుడు రామాంజనేయులు మాట్లాడారు. రైతులకు అన్నదాత సుఖీభవ కింద పెట్టుబడి సాయం రూ.20 వేలు తక్షణం ఇవ్వాలన్నారు. వ్యవసాయ రుణాలు రద్దు చేయాలన్నారు. పంటలకు గిట్టుబాటు ధర కల్పించి నేరుగా ప్రభుత్వమే కొనుగోలు చేయాలన్నారు. స్మార్ట్ మీటర్ల బిగించకూడదన్నారు. ఎన్నికల హామీ మేరకు పేదలకు గ్రామాల్లో 3 సెంట్లు, పట్టణాల్లో 2 సెంట్లు ఇంటిస్థలం కేటాయించి, గృహ నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలన్నారు. ఉపాధి పని దినాలు 200 రోజులకు పెంచి, రోజు కూలి రూ.600 ఇవ్వాలని డిమాండ్ చేశారు.

క్లుప్తంగా

ఎస్ఎస్ఈ బోర్డు కార్యాలయం మార్పు

అనంతపురం ఎడ్యుకేషన్: కృష్ణా జిల్లా విజయవాడలోని గొల్లపూడిలో ఆంధ్ర హాస్పిటల్ ఎదురుగా ఉన్న ఎస్ఎస్ఈ బోర్డు (ప్రభుత్వ పరీక్షల) కార్యాలయాన్ని గుంటూరు జిల్లా మంగళగిరిలోని కళాశాల విద్య కమిషనర్ కార్యాలయం పక్కన సర్వీస్‌రోడ్డులో ఉన్న గరుడవేగ టవర్స్‌లోకి మార్పు చేశారు. ఈ మేరకు డీఈఓ ప్రసాద్‌బాబు, ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ గోవిందునాయక్ తెలిపారు. సోమవారం నుంచి పూర్తిస్థాయిలో కార్యకలాపాలు ఇక్కడి నుంచే సాగుతున్నాయని పేర్కొన్నారు.

రైలు ఎక్కబోతూ కింద పడి యువకుడి మృతి



సుధాకర్ (ఫైల్)

అనంతపురం సిటీ/తాడిమర్రి: రైలు ఎక్కబోతూ అదుపు తప్పి కిందపడి ఓ యువకుడు మృతిచెందాడు.. అనంతపురంలో రైల్వే స్టేషన్‌లో ఈ ఘటన చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన మేరకు.. తాడిమర్రి మండలం ఆత్మకూరు గ్రామానికి చెందిన కల్లే శ్రీరాములు, ఎర్రెమ్మ దంపతులకు ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. కొన్నేళ్ల క్రితం ఎర్రమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. కుమార్తెను అదే గ్రామానికి చెందిన ముసుగు గోపాల్‌కు ఇచ్చి వివాహం చేశారు. కుమారుడు సుధాకర్(26) డిగ్రీ వరకు చదువుకుని తిరుపతికి వెళ్లేందుకు సిద్ధమైన సుధాకర్.. ఆదివారం సాయంత్రం అనంతపురం రైల్వే స్టేషన్‌కు చేరుకున్నాడు. రాత్రి 8 గంటలకు ఉన్న కదిరిదేవరపల్లి–తిరుపతి ట్రైన్ తప్పిపోవడంతో సోమవారం వేకువజామునే వచ్చిన రైలును ఆలస్యంగా గమనించి ఎక్కేందుకు సిద్ధమయ్యాడు. అప్పటికే రైలు ముందుకు కదలడంతో ఎక్కేందుకు ప్రయత్నిస్తూ పట్టు తప్పి కింద రైలు కిందపడి రెండు ముక్కలయ్యాడు. మృతుడి జేబులో ఉన్న ఆధార్ కార్డు ఆధారంగా తాడిమర్రి మండలం ఆత్మకూరు గ్రామ వాసిగా గుర్తించి ఇక్కడి పోలీసులకు రైల్వే పోలీసులు సమాచారం ఇచ్చారు. ఘటనపై రైల్వే పోలీసులు కేసు నమోదు చేశారు.

హడలెత్తించిన పెనుగాలులు



కారుపై పడిన చెట్టు

తాడిపత్రి రూరల్: పట్టణంలో సోమవారం సాయంత్రం పెనుగాలులు ప్రజలను హడలెత్తించాయి. కొద్దిసేపటిలోనే పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద బృందావనం అపార్ట్‌మెంట్ సమీపంలో నిలిపి ఉన్న కారుపై కూకటి వేళ్లతో సహా చెట్టు విరిగి పడింది.

పరిష్కార వేదికకు పోటెత్తిన ప్రజలు

- వివిధ సమస్యలపై 725 వినతులు
- అర్జీల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెట్టండి
- అధికారులకు డీఆర్‌ఓ మలోల ఆదేశం



అర్జీలు స్వీకరిస్తున్న డీఆర్‌ఓ మలోల, అధికారులు

అనంతపురం అర్బన్: కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి వివిధ సమస్యలపై 725 వినతులు అందాయి. డీఆర్‌ఓ ఎ.మలోలతో పాటు డిప్యూటీ కలెక్టర్లు రామకృష్ణారెడ్డి, ఆనంద్, వ్యవసాయ శాఖ అధికారి ఉమామహేశ్వరమ్మ, జిల్లా పంచాయతీ అధికారి నాగరాజునాయుడు, వైద్యశాఖ ఏఓ మల్లికార్జునరెడ్డి అర్జీలు స్వీకరించారు. కార్యక్రమం అనంతరం అర్జీల పరిష్కారంపై అధికారులతో డీఆర్‌ఓ సమీక్షించారు. అర్జీల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు.

వినతుల్లో కొన్ని...

- దివ్యాంగ పింఛను ఇప్పించాలని ఆత్మకూరు మండలం వడ్డుపల్లికి చెందిన దివ్యాంగుడు బాలయోగి విన్నవించాడు. ప్రమాదం జరిగిన అనంతరం జరిగిన శస్త్రచికిత్సలో ఎడమ చేతిని మోచేతి వరకు తొలిగించారని చెప్పాడు. దీంతో పనులు చేసుకోవాలంటే ఇబ్బందిగా ఉందని వాపోయాడు.
- కుటుంబ పోషణ భారంగా మారిందని, తనకు పింఛను ఇప్పించి ఆదుకోవాలని విన్నవించాడు.
- వితంతు పింఛను మంజూరు చేయించాలని అనంతపురంలోని రాణీనగర్‌కు చెందిన నాగలక్ష్మి విన్నవించింది. తన భర్త శరబయ్యకు వృద్ధాప్య పింఛను వచ్చేదని గుర్తు చేశారు. ఆయన 2023, జూన్ 27న మరణించాడని వివరించింది. జీవనానికి తీవ్ర ఇబ్బంది పడుతున్నానని, వితంతు పింఛను మంజూరు చేయించాలని వేడుకుంది.

చీటింగ్ టీచరుకు ‘అధికార’ అండ

- ఆర్టికల్ ఆఫ్ చార్జెస్ నోటీసు ఇవ్వకముందే సస్పెన్షన్ ఎత్తివేత
- ఆ తర్వాత నోటీసు జారీ చేసిన అధికారులు
- విధుల్లో చేరి రెండు నెలలవుతున్నా నేటికీ ఇవ్వని వివరణ
- తెర వెనుక ఉంటూ మంత్రాంగం నడుపుతున్న ఓ ఎమ్మెల్సీ



కాకర్ల దివాకర్‌నాయుడు

అనంతపురం ఎడ్యుకేషన్: ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు, ప్రైవేట్ వ్యాపారులను చీటింగ్ చేసి కోట్లాది రూపాయల కుంభకోణానికి పాల్పడిన ప్రభుత్వ టీచరు కాకర్ల దివాకర్‌నాయుడుకు అధికార పార్టీకి చెందిన కొందరు పెద్దలు అండగా నిలిచారు. ఈ క్రమంలో ఆయనపై కనీస చర్యలు తీసుకోకుండానే తాత్కాలికంగా సస్పెన్షన్ ఎత్తివేయించి ఉద్యోగంలో చేరేలా చేశారు. ఈ వ్యవహారం ప్రస్తుతం ఉపాధ్యాయుల్లో జోరుగా చర్చ సాగుతోంది. అనంతపురంలోని రాజేంద్ర నగర పాలక ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న కాకర్ల దివాకర్‌నాయుడు చీటీల వ్యాపారంతో సుమారు రూ. 10 కోట్ల దాకా మోసానికి పాల్పడిన విషయం తెలిసిందే. అజ్ఞాతంలోకి వెళ్లిన తర్వాత కూడా అసలు విషయం తెలీక కొందరు కొన్ని నెలలు పాటు క్రమం తప్పకుండా చీటీల మొత్తం చెల్లిస్తూ వచ్చారు. ఆయన భాగోతాన్ని గతేడాది జూలైలో వరుస కథనాలతో ‘సాక్షి’ వెలుగులోకి తెచ్చింది. దీంతో బాధితులంతా అప్రమత్తమైనా అప్పటికే జరగాల్సిన నష్టం బాగా జరిగింది. కలెక్టర్, ఎస్పీని కలిసి విన్నవించడంతో వారి ఆదేశాల మేరకు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. ఆ తర్వాత విద్యాశాఖ సస్పెన్షన్ వేటు వేసింది.

ఆ ప్రజాప్రతినిధి ఒత్తిడి మేరకు..

కాకర్ల దివాకర్‌నాయుడుకు తూర్పు రాయలసీమకు చెందిన ఓ ఎమ్మెల్సీ అండగా నిలిచినట్లు ఆరోపణలున్నాయి. ఈ క్రమంలో ఆయనపై సస్పెన్షన్ ఎత్తివేసి స్కూల్‌కు పంపాలని, జీతానికి ఇబ్బంది లేకుండా చూడాలంటూ అధికారులపై ఒత్తిళ్లు చేశారు. ఈ అంశంపై జిల్లా స్థాయి అధికారులు నిర్ణయం తీసుకోలేకపోయారు. దీంతో రాయలసీమ స్థాయి అధికారిపై ఒత్తిడి పెంచారు. ఈ క్రమంలో దివాకర్‌నాయుడుకు ఆర్టికల్ ఆఫ్ చార్జెస్ నోటీసు ఇవ్వకముందే సస్పెన్షన్ ఎత్తివేసి మే 1న అబుల్ కలాం స్కూల్‌కు కేటాయించారు. ఆ తర్వాత ఆర్టికల్ ఆఫ్ చార్జెస్ నోటీసు ఇచ్చారు. దీనిపై ఆయన వివరణ ఇస్తే ఆ తర్వాత విచారణకు ఓ అధికారిని నియమిస్తారు. విచారణ నివేదిక ఆధారంగా చర్యలు తీసుకోనున్నారు. అయితే ఇప్పటి దాకా ఆయన వివరణ కూడా ఇవ్వలేదని తెలిసింది. ఇదే అంశంపై డీఈఓ ప్రసాద్‌బాబు మాట్లాడుతూ.. ‘దివాకర్‌నాయుడుపై సస్పెన్షన్ ఎత్తివేశాం. ఆ తర్వాత చార్జెస్ నోటీసు జారీ చేశాం. వివరణ ఇచ్చాడో లేదో తెలీదు. టీచర్ల బదిలీలు, పదోన్నతులు ఉండడం వల్ల కాస్తా ఆలస్యమైంది. వెంటనే వివరణ తీసుకుని విచారణ అధికారిని నియమిస్తాం. ఆలస్యం కాకుండా నివేదికను ఉన్నతాధికారులకు నివేదిస్తాం’ అని పేర్కొన్నారు.

లబోదిబోమంటున్న బాధితులు..

చీటింగ్ కేసు నిందితుడు దివాకర్‌నాయుడు దర్జాగా తిరుగాడుతుండగా మరోవైపు బాధితులు లబోదిబోమంటున్నారు. విలాసవంతమైన జీవితం గడుపుతూ తమ డబ్బు చెల్లించకుండా చుక్కలు చూపిస్తున్నాడంటూ వాపోతున్నారు. ఇలాంటి వారికి అండగా నిలిచిన ప్రజా ప్రతినిధులు తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

ఇలా.. ఇంకెన్నేళ్లు?!

- మునిసిపల్ ఆర్‌డీ కార్యాలయం ఎదుట ధర్నాలో సచివాలయ ఉద్యోగుల జేఏసీ నాయకులు



మున్సిపల్ ఆర్‌డీ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సచివాలయ ఉద్యోగులు

అనంతపురం కార్పొరేషన్: ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉంటూ సంక్షేమ పథకాల లబ్ధి చేకూరుస్తున్న తమ సేవలను కూటమి ప్రభుత్వం విస్మరించిందని సచివాలయ ఉద్యోగుల జేఏసీ నాయకులు మండిపడ్డారు. పదోన్నతులు కల్పించకుండా బదిలీలు చేపట్టడాన్ని నిరసిస్తూ సోమవారం అనంతపురంలోని మున్సిపల్ ఆర్‌డీ కార్యాలయాన్ని జేఏసీ ఆధ్వర్యంలో సచివాలయ ఉద్యోగులు ముట్టడించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. ఎన్నికలకు ముందు ప్రభుత్వ శాఖల ఉద్యోగులకు అండగా నిలుస్తామని పాలకులు చెప్పి తప్పించుకుంటున్నారన్నారు. సర్వీస్ రూల్స్ కల్పించాలని, క్యాడర్ గుర్తింపు, పదోన్నతి, టెక్నికల్ పదోన్నతులు చేపట్టాలని డిమాండ్ చేశారు. జాబ్ చార్ట్ లేకుండా ఇబ్బంది పెడుతున్నారన్నారు. అసంబద్ధమైన జీఓ 423ను రద్దు చేసి, పారిశుద్ధ్య కార్యదర్శులకు న్యాయం చేయాలన్నారు. సర్వేల భారం తగ్గించాలని, నోషనల్ ఇంక్రిమెంట్స్, డీఏ, పీఆర్‌సీలను అమలు చేయాలన్నారు. అనంతరం డిమాండ్ల కూడిన వినతి పత్రాన్ని మునిసిపల్ ఆర్‌డీ విశ్వనాథ్‌కు అందించారు. కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగుల జేఏసీ నాయకులు లక్ష్మీనారాయణ, సుధాకర్, లక్ష్మి, నరేష్, నారాయణ, వరప్రసాద్, హనుమంతు, మల్లికార్జున, శివశంకర్, వినయ్, నరేష్, భగీరథ రెడ్డి, విమల, మౌలాలమ్మ, హారతి, శశికళ, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

‘పీఎం సూర్యఘర్’ను వేగవంతం చేయండి

- ఎస్పీడీసీఎల్ సీజీఎం వరకుమార్

అనంతపురం టౌన్: పీఎం సూర్యఘర్ పథకంలో భాగంగా అందిన దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను ఏపీ ఎస్పీడీసీఎల్ సీజీఎం వరకుమార్ ఆదేశించారు. సోమవారం అనంతపురంలోని ఎస్ఈ కార్యాలయంలో విద్యుత్ శాఖ అధికారులు, బ్యాంకర్లతో ఆయన సమావేశమై మాట్లాడారు. పీఎం సూర్యఘర్ పథకంలో భాగంగా విద్యుత్ వినియోగదారులు తమ ఇళ్లపై సోలార్ ప్యానళ్లను ఏర్పాటు చేసుకోవడం ద్వారా ఉత్పత్తి అయిన విద్యుత్‌ను ఇంటి అవసరాలకు వినియోగించడంతో పాటు మిగులు విద్యుత్‌ను సంస్థకు విక్రయించుకునేందుకు అవకాశం ఉందన్నారు. కిలో వాట్ల వారీగా సోలార్ ప్యానళ్ల ఏర్పాటుకు బ్యాంకర్లు సైతం రుణాలను అందజేయాలన్నారు. ఇందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక రాయితీలను అందజేస్తోందన్నారు. పీఎం సూర్యఘర్ పథకానికి వచ్చిన దరఖాస్తులను ఆయా ప్రాంతాల బ్యాంకర్లతో సమన్వయం చేసుకొని గ్రౌండింగ్ చేసేలా చర్యలు తీసుకోవాలని ఈఈ, ఏడీలను ఆదేశించారు. కార్యక్రమంలో ఎస్ఈ శేషాద్రి శేఖర్, ఈఈ జేవీ రమేష్, ఏడీలు శ్రీనివాసులు, చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

ఏపీపీఎస్సీ సభ్యుడిగా ఆచార్య శశిధర్



అనంతపురం: ఏపీపీఎస్సీ (ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్) సభ్యుడిగా జేఎన్‌టీయూ (ఏ) సీనియర్ ప్రొఫెసర్, మాజీ రిజిస్ట్రార్ ఆచార్య సి. శశిధర్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా జేఎన్‌టీయూ ప్రొఫెసర్లు, బోధనేతర సిబ్బంది శశిధర్‌కు అభినందనలు తెలిపారు.

సెక్టోరియల్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

- ఈ నెల 30లోపు దరఖాస్తుకు గడువు

అనంతపురం ఎడ్యుకేషన్: సమగ్రశిక్ష కార్యాలయంలో ఖాళీగా ఉన్న సెక్టోరియల్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది. ఇప్పటికే నియామకం పొందిన జీసీడీఓ కవిత, అసిస్టెంట్ ఏఎంఓ ఫణిరాజు బాధ్యతలు స్వీకరించారు. మిగిలిన పోస్టులకు నోటిఫికేషన్ జారీ చేస్తూ సమగ్రశిక్ష ఏపీసీ టి.శైలజ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. అకడమిక్ మానటరింగ్ ఆఫీసర్ (ఏఎంఓ), అసిస్టెంట్ అకడమిక్ మానటరింగ్ ఆఫీసర్ (కన్నడ), అసిస్టెంట్ అల్టర్నేటివ్ స్కూల్ కోఆర్డినేటర్ (అసిస్టెంట్ అలెస్కో), అసిస్టెంట్ ఇన్‌క్లూజివ్ ఎడుయకేషన్ కోఆర్డినేటర్, అసిస్టెంట్ కమ్యూనిటీ మొబైలేజేషన్ ఆఫీసర్ (అసిస్టెంట్ సీఎంఓ), అసిస్టెంట్ స్టాటిస్టికల్ ఆఫీసర్ పోస్టులను భర్తీ చేయనున్నారు. నోటిఫికేషన్, అర్హత వివరాలు, నమూనా దరఖాస్తు వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని శైలజ సూచించారు. పూర్తి చేసిన దరఖాస్తులను ఈ నెల 30వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు అందజేయాలని పేర్కొన్నారు. దరఖాస్తుతో పాటు విద్యార్హత పత్రాలు, సంబంధిత హెచ్‌ఎం, ఎంఈఓతో ధ్రువీకరించిన సర్వీస్ సర్టిఫికెట్, సర్వీస్ పుస్తకం (జిరాక్స్) జత చేయాలని తెలిపారు. కాగా, ఆయా పోస్టులకు స్కూల్ అసిస్టెంట్లు, ఎస్జీటీలూ అర్హులే. అభ్యర్థులకు ప్రాథమిక కంప్యూటర్ నైపుణ్యం తప్పనిసరి. సమగ్రశిక్షలో ఐదేళ్లు నిరంతరం లేదా వేర్వేరు కాలాల్లో డిప్యూటేషన్‌పై పని చేసిన వారు అనర్హులు.

ఎంపిక ఇలా...

విద్యా, వృత్తిపరమైన అర్హతలకు సంబంధించి 85 మార్కులు, ఇంటర్వ్యూకు 15 మార్కులు చొప్పున కేటాయించారు. అడకమిక్, ప్రొఫెషనల్ విద్యార్హతల్లో పొందిన మార్కుల ఆధారంగా వెయిటేజీ లెక్కిస్తారు. ఉదాహరణకు ఒక అభ్యర్థికి డిగ్రీలో 640/1000 మార్కులు సాధిస్తే మార్కుల వెయిటేజీ 6.4గా కేటాయిస్తారు. స్కూల్ అసిస్టెంట్, ఎస్జీటీలు ఆయా కేడర్లలో అందించిన సేవలకు మార్కులు కేటాయిస్తారు. ఏడాదికి రెండు మార్కులు చొప్పున లెక్కిస్తారు.

హెచ్చెల్సీ పనుల పరిశీలన

కణేకల్లు/బొమ్మనహాళ్: తుంగభద్ర ప్రధాన ఎగువ కాలువ పరిధిలో రూ.35.06 కోట్లతో చేపట్టిన ఆధునికీకరణ పనులను క్వాలిటీ కంట్రోల్ ఎస్ఈ మునీర్‌బాషా, ఈఈ రమేష్, డీఈఈ చంద్రశేఖర్ సోమవారం తనిఖీ చేశారు. 115వ కిలోమీటర్ నుంచి 189వ కిలోమీటర్ వరకూ చేపట్టిన బ్రిడ్జి, యూటీ, లైనింగ్, అవుట్‌ఫాల్ రెగ్యులేటర్ పనులతో కలిపి మొత్తం 11 పనులను క్వాలిటీ కంట్రోల్ అధికారులు పరిశీలించారు. నాణ్యత ప్రమాణాల మేరకు పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు. కార్యక్రమంలో క్వాలిటీ కంట్రోల్ డీఈఈ చంద్రశేఖర్, జేఈ ఓబుళపతి, రమణారెడ్డి, కన్‌స్ట్రక్షన్ ఈఈ పార్థసారథి, కణేకల్లు హెచ్చెల్సీ డీఈఈ దివాకర్‌రెడ్డి, జేఈలు నరేంద్ర మారుతి, అల్తాఫ్, నజురీద్దీన్ పాల్గొన్నారు.

ఆశ కార్యకర్తల పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం మెడికల్: జిల్లా కేంద్రంలోని అర్బన్, రూరల్ ప్రాంతాల్లో ఖాళీగా ఉన్న 58 ఆశా కార్యకర్తల పోస్టుల భర్తీకి అర్హులైన వారి నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు డీఎంహెచ్‌ఓ డాక్టర్ భ్రమరాంబదేవి తెలిపారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 25 నుంచి 30వ తేదీ వరకు పీహెచ్‌సీ, సచివాలయాల్లో దరఖాస్తులు అందజేయాలి. పోస్టుల వివరాల కోసం https://ananthapuramu.ap.gov.in వెబ్‌సైట్‌లో పరిశీలించవచ్చు.

గీత కులాల మద్యం షాపులకు దరఖాస్తుల స్వీకరణ

అనంతపురం: గీత కులాల వారికి మద్యం షాపుల కేటాయింపునకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రొహిబిషన్ ఎక్సైజ్ జిల్లా అధికారి బి. రామ్మోహన్‌రెడ్డి సోమవారం తెలిపారు. జిల్లాలోని డి.హీరేహాళ్‌లో గౌండ్ల కులస్తులకు ఓ షాపు, రాయదుర్గం రూరల్‌లో గౌడ్ కులస్తులకు ఓ షాపు, గుత్తి రూరల్ పరిధిలో మరో షాపు, కంబదూరు మండలంలో ఈడిగ సామాజిక వర్గానికి ఓ షాపు కేటాయించారు. ఆయా ప్రాంతాల్లో అర్హులైన ఆయా సామాజిక వర్గం వారు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి. జిల్లాలోని ఎక్సైజ్ పోలీస్ స్టేషన్లలో దరఖాస్తులను ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ విధానంలో ఈ నెల 30వ తేదీలోపు అందించాలి. డిపాజిట్ రూపంలో రూ.2 లక్షలు చెల్లించాలి. జూలై 1న జిల్లా కేంద్రంలోని ప్రొహిబిషన్ ఎక్సైజ్ జిల్లా అధికారి కార్యాలయంలో లాటరీ ప్రక్రియ చేపట్టి అర్హులను ఎంపిక చేస్తారు.

క్లుప్తంగా

'అన్నదాత సుఖీభవ' అందజేయాలి



డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న సీపీఐ నేతలు

ఆత్మకూరు: కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు అధికారంలోకి వస్తే రైతులకు అన్నదాత సుఖీభవ పథకం కింద రూ.20 వేలు రైతులకు అందజేస్తామని హామీ ఇచ్చింది. అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా రైతులకు ఒక్క రూపాయి కూడా సహాయం చేయలేదు. తక్షణమే రైతులకు పెట్టుబడి సాయం నగదును రైతుల ఖాతాల్లోకి జమ చేయాలని సీపీఐ మండల కార్యదర్శి రామకృష్ణ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ బాలమ్మకు వినతిపత్రం అందజేశారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనా ప్రభుత్వం రైతులను పట్టించుకోలేదన్నారు. కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని కోరారు. పంటల బీమా ప్రీమియం అందించాలన్నారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు తులిసే నాయక్, గోపాల్, హనుమన్న, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

'ఎస్వీ' విద్యార్థులకు ఉద్యోగాలు



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

అనంతపురం ఎడ్యుకేషన్: స్థానిక ఎస్వీ డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థులు ప్రముఖ టెక్ కంపెనీ టీసీఎస్‌కు ఎంపికయ్యారు. సదరు కంపెనీ దేశ వ్యాప్తంగా నిర్వహించిన ప్రతిష్టాత్మక టీసీఎస్ బీఎస్సీ ఐజీఎన్ఐటీఏ, స్మార్ట్ హైరింగ్ కార్యక్రమంలో భాగంగా ఎస్వీ డిగ్రీ, పీజీ కళాశాలకు చెందిన 2022–25 బ్యాచ్ నలుగురు విద్యార్థులు పరీక్షలు, ఇంటర్వ్యూను విజయవంతంగా పూర్తి చేశారు. సదరు కంపెనీలో ఉద్యోగాలకు ఎంపికయ్యారు. సోమవారం ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను కళాశాల వైస్ చైర్మన్ సి.చక్రధర రెడ్డి అభినందించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్వీ ప్రసాద్ మాట్లాడుతూ.. విద్యార్థులు భావ వ్యక్తీకరణ నైపుణ్యాలు, ఇతర నైపుణ్యాలను పెంపొందించుకుంటేనే ఉద్యోగాలు లభిస్తాయన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ టి.శ్రీనివాసులు, గణిత శాస్త్ర విభాగాధిపతి సి.రవి కుమార్, ప్లేస్‌మెంట్ అధికారి ఎస్.సాయిరాం, అధ్యాపకులు పాల్గొన్నారు.

894 మందికి అందని 'తల్లికి వందనం'



మాట్లాడుతున్న తహసీల్దార్ విజయకుమారి

రాప్తాడు: మండల వ్యాప్తంగా వివిధ కారణాలతో 894 మందికి తల్లికి వందనం సొమ్ము జమ కాలేదని తహసీల్దార్ విజయకుమారి తెలిపారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో 'తల్లికి వందనం' పథకంపై డిజిటల్, వెల్ఫేర్ అసిస్టెంట్లతో ప్రత్యేక గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అనర్హుల జాబితాలో ఉన్న వారు తహసీల్దార్‌కు అర్జీలు అందజేశారు. భూమి ఎక్కువగా ఉండటం, నాలుగు చక్రాల వాహనం, ప్రభుత్వ ఉద్యోగులు, ఇన్‌కమ్ ట్యాక్స్, 300 యూనిట్లు కరెంట్ బిల్లు తదితర కారణాలతో చాలామంది అనర్హుల జాబితాలో ఉన్నారని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి విద్యార్థి తల్లి ఖాతాలో నగదు జమ అయ్యేలా చూస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీటీ చెన్నకేశవులు, ఆర్‌ఐ రాగే కరణాకర్, సర్వేయర్ రామాంజినేయులు, డిజిటల్, వెల్ఫేర్ అసిస్టెంట్లు, వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యత లోపిస్తే చర్యలు



సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ బి.విజయలక్ష్మి

రాప్తాడు: సీసీ రోడ్డు పనుల్లో నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవని ఎంపీడీఓ బి.విజయలక్ష్మి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని హంపాపురం గ్రామంలో 15వ ఆర్థిక సంఘం నిధులతో చేపడుతున్న సీసీ రోడ్డు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. గ్రామాల్లో చేపడుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యత లోపిస్తే కాంట్రాక్టర్లపై చర్యలు తప్పవని హెచ్చరించారు. సీసీ రోడ్డు పనులు నాణ్యతగా చేపడితేనే బిల్లులు పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ ఆనంద ప్రసాద్, ఏపీఓ సావిత్రి, ఈసీ మురళీ తదితరులు పాల్గొన్నారు.



బస్సు రాకపోకలు ఆపేశారని చెబుతున్న రైతు నరసింహులు



అధ్వానంగా తయారైన ఉప్పరపల్లి, పసలూరు, పూలకుంటకు వెళ్లే దారి

గుంతల దారి..

పడతారు జారి

అధికారంలోకి వచ్చిన వెంటనే రోడ్లు వేయించి, రవాణా వ్యవస్థను మెరుగుపరుస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం.. హామీల అమలులో ఘోరంగా విఫలమైంది. సూపర్ సిక్స్ అమలు చేయలేక చేతులెత్తేసింది. రాప్తాడు నియోజకవర్గంలోని ఉప్పరపల్లి, పసలూరు, పూలకుంట, దుర్గం ప్రాంతాల్లో రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. గుంతల దారుల్లో ప్రయాణం నరకంగా మారింది. ఈ మార్గాల్లో రాకపోకలు సాగించేందుకు వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో ఈ రూట్‌లో ఓ బస్సు రాకపోకలు సాగించేది. రోడ్డు దెబ్బతిని అధ్వానంగా మారడంతో ఆర్టీసీ అధికారులు బస్సును రద్దు చేశారు. నగరానికి చేరువుగా ఉండే ప్రాంతాలకు బస్సు సౌకర్యం లేకపోవడంతో పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, ప్రజలకు అవస్థలు తప్పడం లేదు. ఇక ఆత్మకూరు నుంచి పి.యాలేరుకు వెళ్లే దారి కంకర తేలడంతో వాహనదారులు ప్రత్యక్ష నరకం చూస్తున్నారు. గుంతలు ఎక్కువగా ఉండటంతో ఆటోలు, ద్విచక్ర వాహనలు మరమ్మతులకు గురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక వర్షం వస్తే గుంతల్లో వర్షపు నీరు చేరుతోంది. గుంతలు కనబడక ప్రమాదాలు సైతం చోటుచేసుకుంటున్నాయి. ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్లు నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

– ఆత్మకూరు/సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం:



రోడ్డు దెబ్బతినడంతో కంకర తేలిన దృశ్యం



గుంతలమయంగా మారిన ఆత్మకూరు నుంచి పి.యాలేరుకు వెళ్లే రోడ్డు

ప్రజా సంక్షేమాన్ని విస్మరించిన ప్రభుత్వం

అనంతపురం అర్బన్: ప్రజలకు హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం పాలనలో ఘోరంగా విఫలమైందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ తీవ్రస్థాయిలో విమర్శించారు. సూపర్‌సిక్స్ అమలుకు కుంటిసాకులు చెబుతున్నారని మండిపడ్డారు. పేదరికం పెంచే దిశగా చంద్రబాబు పాలన సాగిస్తున్నారని ధ్వజమెత్తారు. మీ వైఫల్యాలు, దుర్మార్గాలపై ప్రజలు కచ్చితంగా తిరగబడతారని హెచ్చరించారు. బీజేపీతో దేశానికి ప్రమాదం పొంచి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. సోమవారం స్థానిక లలిత కళాపరిషత్‌లో సీపీఐ నగర మహాసభ నిర్వహించారు. నగర కార్యదర్శి శ్రీరాములు అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రామకృష్ణతో పాటు జిల్లా కార్యదర్శి సి.జాఫర్ పాల్గొని మాట్లాడారు. గత ప్రభుత్వం కంటే మంచి పాలన అందిస్తారన్న నమ్మకంతో కూటమికి ప్రజలు అధికారం కట్టబెడితే ప్రజా సంక్షేమాన్ని విస్మరించి పాలన సాగిస్తోందన్నారు. ఒకవైపు నిరుద్యోగం తీవ్రంగా ఉంటే ఉద్యోగాలు కల్పించడంపై దృష్టి పెట్టలేదన్నారు. సూపర్ సిక్స్ హామీలు అమలు చేయకుండా కుంటి సాకులు చెబుతున్నారని విమర్శించారు. పాలన పక్కన పెట్టి కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారని విమర్శించారు. మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ప్రయాణిస్తున్న కారు ప్రమాదంలో



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

వ్యక్తి మృతి చెందితే అది జగన్‌కు ఏవిధంగా సంబంధం.. ఆయనపై కేసులు ఎలా పెడతారని ప్రశ్నించారు. 'అలా అయితే గతంలో మీరు పుష్కరాలకు వెళ్లినప్పుడు.. ఎన్నికల సభలో జరిగిన తొక్కిసలాటలో ప్రజలు చనిపోయారు. ఆ ఘటనల్లో మీపై ఎందుకు కేసులు పెట్టకూడదని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రజామోదయోగ్యమైన పాలన అందించి ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంపై దృష్టి పెట్టాలన్నారు. అంబేడ్కర్ రాజ్యాంగానికి అధికారంలోని బీజేపీ ప్రభుత్వం విఘాతం కలిగించే విధానాలను అనుసరిస్తోందన్నారు. కార్యక్రమంలో నాయకులు చిరుతల మల్లికార్జున, రాజారెడ్డి, లింగమయ్య, జాన్సన్ బాబు, పద్మావతి, సంతోష్ కుమార్, రమణయ్య, అల్లీపీరా, రాజేష్‌గౌడ్, కృష్ణుడు, కుళ్లాయిస్వామి, చిరంజీవి, జయలక్ష్మి, హనుమంత రాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీకే మద్యం విక్రయించాలి

- ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య

రాయదుర్గం: ప్రైవేట్ మద్యం దుకాణాల్లో నిబంధనల మేరకు ఎమ్మార్పీకే విక్రయించాలని ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య సూచించారు. సోమవారం ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏఈఎస్ శ్రీరామ్, స్థానిక సీఐ మహేష్‌కుమార్‌తో కలసి పట్టణంలోని పలు మద్యం దుకాణాల్లో తనిఖీలు చేశారు. అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌లో రికార్డులు పరిశీలించారు. సీఐ మహేష్‌కుమార్‌తో నవోదయం 2.0, కర్ణాటక మద్యం అక్రమ రవాణా, పీడీ యాక్ట్ నమోదుపై అడిగి తెలుసుకున్నారు. బెల్టు షాపులు నిర్మూలనతో పాటు కర్ణాటక మద్యం ఎట్టిపరిస్థితుల్లో ఏపీలోకి



మద్యం దుకాణంలో తనిఖీలు చేస్తున్న డీసీ నాగమద్దయ్య, సిబ్బంది

దిగుమతి కాకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అనంతరం కర్ణాటక సరిహద్దులోని డి హీరేహాళ్ మండలం ఓబుళాపురం వద్ద ఎక్సైజ్ చెక్‌పోస్టును ఆకస్మికంగా తనిఖీ చేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

నార్పల: రెండు ద్విచక్ర వాహనాలు ఢీ కొనడంతో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని బొందలవాడ గ్రామ శివారులో సోమవారం చోటు చేసుకుంది. వివరాలు.. మండలంలోని బొందలవాడకు చెందిన నాగభూషణం(40) వ్యక్తిగత పనుల నిమిత్తం మండల కేంద్రానికి వచ్చి తిరిగి గ్రామానికి బయలుదేరాడు. మార్గమధ్యలో బత్తలపల్లి నుంచి తాడిపత్రి వైపు వెళ్తున్న ఓ గుర్తు తెలియని వ్యక్తి ద్విచక్ర వాహనంలో వస్తూ ఢీ కొనడంతో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వారిని జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ నాగభూషణం మృతి చెందాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ సాగర్ తెలిపారు.

దళారీ వ్యవస్థ నిర్మూలనకు కృషి

రాప్తాడు: రైతులే సంస్థలను బలోపేతం చేసుకుంటే దళారీ వ్యవస్థను పూర్తిగా నిర్మూలించావచ్చని ఏఎఫ్ ఏకాలజీ సీబీఓ కో–ఆర్డినేటర్ భాస్కర్ బాబు అన్నారు. సోమవారం మండలంలోని మరూరు, ఎం.బండమీదపల్లి గ్రామాల్లో రైతు ఉత్పత్తిదారుల పరస్పర సహాయక సహకారం సంఘం లిమిటెడ్ 9వ వార్షిక మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా భాస్కర్ బాబు మాట్లాడుతూ.. ఏఎఫ్ ఏకాలజీ సంస్థ సహకారంతో ఈ రైతు సంస్థను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. రైతులు తాము పండించిన పంటలను రైతు సంస్థలకే అమ్మాలన్నారు. ప్రతి ఒక్కరూ రైతు సంస్థలను బలోపేతం చేసుకోవాలన్నారు. మండలా వ్యాప్తంగా రైతు సంస్థలో మొత్తం 413 మంది వాటాదారులు ఉన్నారని తెలిపారు. 2024–25 వార్షిక ఆర్థిక సంవత్సరంలో రైతు సంస్థలో జరిగిన వ్యాపార ఆర్థిక లావాదేవీలు ఆడిట్ నివేదిక, పంటలు కొనుగోలు అమ్మకాలు వివరాలను



మాట్లాడుతున్న ఏఎఫ్ ఏకాలజీ సీబీఓ కో–ఆర్డినేటర్ భాస్కర్ బాబు

వాటాదారులకు తెలియజేశారు. అనంతరం నూతన పాలకవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మండల టీం లీడర్ దస్తగిరి, ఏఈ విష్ణువర్ధన్ రెడ్డి, రైతు సంస్థ మేనేజర్ ప్రతాప్ కుమార్, రైతు సంస్థ సీఈఓ మంజునాథ్, అధ్యక్షురాలు అనురాధ, ఎస్‌టీఓలు విక్రమ్, వేణు, అరుణ, వాటాదారులు, రైతులు పాల్గొన్నారు.

'యువత పోరు'కు తరలిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు

రాప్తాడు: యువత జీవితాలతో కూటమి ప్రభుత్వం చెలగాటమాడుతోందని వైఎస్సార్‌సీపీ యూత్ మండల కన్వీనర్ బుడ్డారెడ్డి గారి విశ్వనాథ్ రెడ్డి, మాజీ మండల యూత్ కన్వీనర్ చిట్రెడ్డి సత్యనారాయణ రెడ్డి ధ్వజమెత్తారు. ఎన్నికల్లో యువతకు ఇచ్చిన హామీలు చేయాలని కోరుతూ వైఎస్సార్‌సీపీ యువజన విభాగం ఆధ్వర్యంలో పుట్టపర్తి జిల్లాలో చేపట్టిన యువత పోరు కార్యక్రమానికి రాప్తాడు మండలం నుంచి వందలాది మంది యువత తరలివెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నిరుద్యోగుల పక్షాన నిలుస్తూ చంద్రబాబు సర్కార్‌పై నిరసన గళం వినిపించేందుకు యువత పోరు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కూటమి ప్రభుత్వం విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేసే వరకూ నిరసన తెలియజేస్తామని తెలిపారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు మేనిఫెస్టోలో చెప్పిన విధంగా యువతకు రూ.3 వేల నిరుద్యోగ భృతి తక్షణమే ఇవ్వాలని డిమాండ్ చేశారు. మేనిఫెస్టోలో 20 లక్షల ఉద్యో



పుట్టపర్తికి బయలుదేరిన వైఎస్సార్‌సీపీ నాయకులు

గాలు, నిరుద్యోగులకు నెలకు రూ.3 వేలు నిరుద్యోగ భృతి ఇస్తామని ప్రకటించిందన్నారు. కానీ ఏడాది పాలనలో నిరుద్యోగ భృతి ఊసే లేకుండా పోయిందన్నారు. వలంటీర్లు, ఎండీయూ వాహనాల నిర్వాహకులు ఉపాధి కోల్పోయి రోడ్డున పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు మాచిరెడ్డి చెన్నారెడ్డి, నరసింహ రెడ్డి, తలారి సింగారప్ప, గొల్లపల్లి లక్ష్మీ రెడ్డి, చిగిచెర్ల శంకర్ రెడ్డి, బ్రహ్మానంద రెడ్డి, రామలింగమయ్య తదితరులు పాల్గొన్నారు.

సహకార బ్యాంకులను లాభాల బాట పట్టిద్దాం

- డీసీసీబీ పర్సన్ ఇన్‌చార్జి ముంటిమడుగు కేశవరెడ్డి

అనంతపురం అగ్రికల్చర్: సహకార బ్యాంకులను లాభాల బాట పట్టించి రాష్ట్రంలోనే ఆదర్శంగా నిలిచేలా చేద్దామని జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ) ఉద్యోగులకు ఆ బ్యాంక్ పర్సన్ ఇన్‌చార్జి ముంటిమడుగు కేశవరెడ్డి పిలుపునిచ్చారు. నూతనంగా ఆయన బాధ్యతలు తీసుకున్న అనంతరం సోమవారం స్థానిక డీసీసీబీ హాల్‌లో సీఈఓ కె.సురేఖారాణి అధ్యక్షతన జరిగిన 129వ మహాజన సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. రైతులకు ప్రాధాన్యతనిస్తూనే మిగిలిన వర్గాలకు బ్యాంకింగ్ సేవలు అందించి సమష్టి కృషితో బ్యాంకు పురోభివృద్ధికి పాటుపడాలని కోరారు. 2024–25 ఆర్థిక సంవత్సరం ఆడిట్ రిపోర్టు, జమా ఖర్చులను మహాజనసభ ఆమోదించింది. అలాగే 2025–26 బడ్జెట్ కేటాయింపులపై చర్చించారు. గతేడాదికి సంబంధించి రూ.1.55 కోట్లను బైలా ప్రకారం వివిధ పద్దులకు కేటాయించారు. సమావేశంలో డీజీఎంలు, ఏజీఎంలు, మేనేజర్లు, పీఏసీఎస్ చైర్మన్లు పాల్గొన్నారు.

తప్పిన పెను ప్రమాదం

రాయదుర్గంటౌన్: పట్టణంలోని డాక్టర్ రాధాకృష్ణ మున్సిపల్ హైస్కూల్ వద్ద సోమవారం మధ్యాహ్నం విద్యుత్ స్తంభం విరిగిపడింది. అయితే ప్రమాదం జరగకపోవడంతో ఊపిరి అందరూ పీల్చుకున్నారు. చెట్టుకొమ్మ విద్యుత్ తీగలపై పడగా, ఏకంగా విద్యుత్ స్తంభం విరిగి కింద వాలింది. దీంతో విద్యుత్ తీగల చెల్లాచెదరయ్యాయి. ఈ ప్రాంతంలో మున్సిపల్ పాఠశాలతోపాటు ఓ ప్రైవేట్ పాఠశాల కూడా ఉంది. ఈ ఘటన జరిగిన సమయంలో విద్యార్థులు ఎవరూ లేకపోవంతో పెద్ద ప్రమాదమే తప్పింది. గతంలో పలుమార్లు స్థానికులు విద్యుత్ స్తంభం, తీగల గాలి వేగానికి ఊగుతున్నట్లు ఫిర్యాదు చేస్తున్నా విద్యుత్ శాఖ అధికారులు పట్టించుకోలేదన్నారు. క్షేత్రస్థాయిలో సిబ్బంది అక్కడికి చేరుకుని మరమ్మతు పనులు చేపట్టారు.



నేలకూలిన విద్యుత్ స్తంభం

రాజకీయ నాయకుల మెప్పు కోసం పని చేస్తారా?

ఆత్మకూరు: 'ప్రభుత్వ ఉద్యోగులు ప్రజలకు ప్రభుత్వానికి వారధిలా పని చేయాలి. అయితే మండలంలో కొంత మంది అధికారులు రాజకీయ నాయకులకు సేవ చేస్తూ వారి మెప్పు పొందుతున్నారు. ప్రభుత్వ అధికారులు ఉద్యోగాలు మరిచి రాయకీయాలు చేయడం సరికాదు' అని ఎంపీపీ సుబ్బర హేమలత ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. తన అనుమతి లేకుండా చాంబర్‌లోకి ఎలా వెళ్తారని ప్రశ్నించారు. అధికారులు బాధ్యత మరిచి వ్యవహరిస్తున్నారని.. ఎవరి స్థాయి ఏమిటో తెలుసుకోవాలని హితవు పలికారు. ప్రభుత్వ కార్యాలయంలో ప్రజా ప్రతినిధుల మధ్య జరిగే విషయాలను అధికార పార్టీ నాయకులకు చెబుతూ తొత్తులుగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. జిల్లా స్థాయి అధికారులు స్పందించి ప్రజా ప్రతినిధులకు గౌరవం ఇవ్వని అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

మహిళ ఆచూకీ లభ్యం

అనంతపురం: నగరంలోని ఆర్కే నగర్‌లో నివాసం ఉంటున్న అమరవాణి అనే మహిళ ఇటీవల పిల్లలను తీసుకుని అదృశ్యం అయిన విషయం తెలిసిందే. కేసు నమోదు చేసుకున్న పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. గుంటూరు సమీపంలోని పాన్నూరులో ఉండటంతో సోమవారం అనంతపురం తీసుకొచ్చి భర్తకు అప్పగించారు. వివరాలు.. అమరవాణికి 7 సంవత్సరాల క్రితం కిరణ్‌తో వివాహం జరిగింది. తల్లిదండ్రులు ఇద్దరూ లేరు. వీరికి రెండు సొంత ఇళ్లు ఉన్నాయి. వీటికి వచ్చే బాడుగ తమ చెల్లి తీసుకుంటుందనే అంశంపై భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. తన చెల్లికి చెప్పలేక, భర్తకు చెప్పలేక మనస్తాపానికి గురైన అమరవాణి.. మూడు రోజుల క్రితం పిల్లలను తీసుకుని పినతండ్రి ఉండే పాన్నూరుకు వెళ్లిపోయింది. పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. సీడీఆర్ ఆధారంగా కానిస్టేబుల్‌ను పంపించి.. అమరవాణి, ఆమె పిల్లలను క్షేమంగా తీసుకొచ్చి భర్తకు అప్పగించినట్లు త్రీ టౌన్ సీఐ కే.శాంతిలాల్ తెలిపారు.

నేడు విద్యుత్ అంతరాయం

అనంతపురం టౌన్: నగరంలోని డీ–4 సెక్షన్ పరిధిలోని హౌసింగ్ బోర్డు, విద్యుత్ నగర్, అశోక్ నగర్, సాయినగర్, అరవింద్ నగర్, నాయక్ నగర్, లక్ష్మీనరసయ్య కాలనీ తదితర ప్రాంతాల్లో విద్యుత్ టవర్ల మరమ్మతులు జరుగుతున్నాయి. మంగళవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏడీ చంద్రశేఖర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని ఆయా ప్రాంతల ప్రజలు గమనించాలని కోరారు.

26 నుంచి వారాహి నవరాత్రులు

అనంతపురం కల్చరల్: కొత్తూరు వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో వారాహి నవరాత్రులు ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 26 నుంచి జూలై 4వ తేదీ వరకు నవరాత్రులు కొనసాగుతాయని పేర్కొన్నారు. ప్రతినిత్యం వారాహి అష్టోత్తరం, వారాహి కవచం, వారాహి స్తుతి, వారాహి ద్వాదశ స్తోత్రం, అష్టోత్తరానికి కుంకుమను మహిళా మండలి వారు సమకూరుస్తారని తెలిపారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

జూదరుల అరెస్ట్

అనంతపురం: నగరంలోని గంగానగర్ కోళ్ల ఫాం వద్ద జూదం (లోపల–బయట మంగపత్తా) ఆడుతున్న ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు త్రీటౌన్ సీఐ కే.శాంతిలాల్ తెలిపారు. ఇందిరా నగర్‌కు చెందిన ఎం. నారాయణ కుమారుడు ముత్యాల రాముడు, ఎం.జయరాజు కుమారుడు ఎం.నరేష్, రాయల్‌నగర్‌కు చెందిన ఎస్.మునెప్ప కుమారుడు ఎం.నాగరాజును అదుపులోకి తీసుకున్నట్లు వెల్లడించారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పాఠ్యపుస్తకాల పంపిణీ

ఆత్మకూరు: స్థానిక కస్తూర్బా పాఠశాల విద్యార్థులకు సోమవారం ఎంఈఓ–2 రామాంజనేయులు పాఠ్య పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలతో పాటు విద్యా సామగ్రి అందజేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ లీమారోజ్ తదితరులు పాల్గొన్నారు.